క్లుప్తంగా

ముమ్మరంగా స్వచ్ఛ సర్వేక్షన్ సర్వే


దుకాణదారుల నుంచి సమాచారం సేకరిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కొడంగల్ రూరల్: మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు.. సిబ్బంది కొద్ది రోజులుగా స్వచ్ఛ సర్వేక్షన్ సర్వే కొనసాగిస్తున్నారు. గురువారం పట్టణంలోని దుకాణదారులను, ఇంటి యజమానులను సంప్రదించారు. పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు ఎలా జరుగుతున్నాయనే సమాచారం, అభిప్రాయం తీసుకొని, వారి ఫోన్ నంబర్లతో సర్వేక్షన్ యాప్‌లో పొందుపరుస్తున్నారు. ఇంటి పరిసరాలకు చెత్త బండి వస్తుందా, మురుగుకాల్వలు శుభ్రంగా ఉంటున్నాయా? లేని పక్షంలో సిబ్బందిని పురమాయిస్తూ.. తగిన చర్యలు వెనువెంటనే చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది నాగరాజు, నరేష్, మహిమూద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ పనుల పరిశీలన


సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్లు

కొడంగల్ రూరల్: పట్టణంలోని 11వ వార్డులో కొనసాగుతున్న సీసీరోడ్డు పనులను మున్సిపల్ కౌన్సిలర్లు రహత్‌బేగం, మధుసూదన్‌రావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచనలు, సలహాలు ఇచ్చారు. నిర్మాణ పనులు నాణ్యతగా ఉండాలని ఆదేశించారు.

ఎన్‌యూసీఎస్‌కు పీహెచ్‌సీ ఎంపిక


దౌల్తాబాద్ పీహెచ్‌సీ

దౌల్తాబాద్: దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎన్‌యూసీఎస్(నేషనల్ క్వాలిటీ కంట్రోల్ సొసైటీ)కి ఎంపికయినట్లు వైద్యాధికారి రతన్‌లాల్ తెలిపారు. ఇటీవల ఎన్‌యూసీఎస్ఎస్ కేంద్ర బృందం రెండు రోజుల పాటు ఆస్పత్రి సేవలు, రికార్డులు, సిబ్బంది పని తీరును పరిశీలించి 83.14 పాయింట్లతో ఎంపిక చేసినట్లు వెల్లడించారు. దీంతో ఆస్పత్రికి యేటా నిధులు మంజూరవుతాయని, వీటితో అభివృద్ధి పనులు చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

కాంగ్రెస్ గెలుపు తథ్యం

బంట్వారం: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు తథ్యమని ఆ పార్టీ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు నర్సింగ్‌నాయక్ ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం కంకణాలపల్లిలో పార్టీ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. జిత్తుల మారి కేసీఆర్‌ను ప్రజలు నమ్మేస్థితిలో లేరని, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడించాలన్నారు. పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయూబ్ అన్సారీ, బార్వాద్ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు కొత్తపల్లి ఏసయ్య, రామునాయక్, రాచిరెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

యమడేంజర్

- గుంతల్లో కంకరపోసి వదిలేసిన ఆర్‌అండ్‌బీ
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు


రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో కంకర పోసిన ప్రాంతం

ధారూరు: ఇది తాండూర్–హైదరాబాద్ ప్రధాన రహదారి. ధారూరు నుంచి వికారాబాద్ వెళ్లే దారిలో ఒంటిమామిడి చెట్టు టర్నింగ్ రోడ్డు ద్విచక్ర వాహనదారులకు చుక్కలు చూపిస్తోంది. ఆర్‌అండ్‌బీ సిబ్బంది పొరపాటు, వారి పాలిట శాపంగా మారింది. రోడ్లపై గుంతలు ఏర్పడిన ప్రతిచోటా.. కంకర, డాంబర్ పోసి, పైన డస్ట్‌వేసి సరిచేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ మాత్రం గుంతలు ఏర్పడిన ప్రతి చోటా కంకర పోసి వదిలేశారు. దీంతో బస్సులు, లారీలు తదితర వాహనాలు గుంతలపై నుంచి దూసుకెళ్తూ కంకరను ఇరువైపులా ఈడ్చుకెళ్తున్నాయి. తద్వారా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అదుపుతప్పి కిందపడి గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతలను డాంబర్ పోసి సరిచేయాలని కోరుతున్నారు.

ఎందుకీ అసమానత

'విధి నిర్వహణలో మొదటి ఏఎన్‌ఎంలకు ఏమాత్రం తీసిపోము. వారితో సమానంగా రోగులకు సేవలందిస్తున్నాం. కరోనా సమయంలో మా సేవలను సర్కారు గుర్తించి హర్షం వ్యక్తంచేసింది. కానీ వేతనం విషయంలో ఎందుకు వ్యత్యాసం చూపుతోంది?. మా సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదని' సెకండ్ ఏఎన్‌ఎంలు ఆవేదన వ్యక్తంచేశారు.

- వివక్ష చూపుతున్న ప్రభుత్వం
- దశాబ్దన్నర కాలంగా చాకిరీ చేస్తున్నాం
- క్రమబద్ధీకరణకు నోచుకోని తమ బతుకులు
- వేతనంలో వెనుకబాటు తనం
- నిరసన వ్యక్తంచేసిన రెండో ఏఎన్‌ఎంలు


కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు(ఫైల్)

కొడంగల్ రూరల్: ఫస్ట్ ఏఎన్‌ఎంలతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా తమను ప్రభుత్వం పట్టించు కోవడం లేదని సెకండ్ ఏఎన్‌ఎంలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన బాట పట్టారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని ధర్నాలు నిర్వహిస్తూ ఆస్పత్రుల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా గురువారం మండల పరిధిలోని అంగడిరాయిచూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట సెకండ్ ఏఎన్‌ఎంలు కూర్చొని నిరసనలు వ్యక్తం చేశారు.

పని విధానం ఒక్కటే..

పీహెచ్‌సీలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి 33రకాల సేవలను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నామని, ఫస్ట్ ఏఎన్‌ఎంలకు సహాయకురాలిగా విధులు నిర్వహించాల్సి ఉందని, ఫస్ట్ ఏఎన్‌ఎంల చదువు, సెకండ్ ఏఎన్‌ఎంల చదువు, విధులు, బాధ్యతలు సమానంగానే ఉన్నాయని, వేతనాలు ఇవ్వడంలో తేడా ఎందుకు చూపుతోందని ప్రశ్నిస్తున్నారు.

ఏఎన్‌ఎంలపై వివక్ష

సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని ఎన్నో పర్యాయాలు నిరసనలు వ్యక్తం చేశామని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందించడకపోవడం బాధాకరమని ఏఎన్‌ఎంలు వాపోయారు. 2006 నుంచి సెకండ్ ఏఎన్‌ఎంలను కాంట్రాక్ట్ బేసిక్‌పై తీసుకున్నారని, కరోనా సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని విధులు నిర్వహించామని, ఆ సమయంలో ప్రభుత్వం తమపై పూల వర్షం కురిపిస్తూ సంబురాల్లో పాల్గొన్నా, ఇప్పటి వరకు తమ సమస్యలను పరిష్కరించడం లేదని ఆరోపించారు.

నోటిఫికేషన్ రద్దుచేయాలి

15ఏళ్లుగా రోగులకు సేవలందిస్తున్నా ప్రభుత్వం ఏఎన్‌ఎం–2లపై వివక్షత చూపుతుందని విమర్శించారు. గడిచిన ఆరు నెలల కాలంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జనవరి 12న ఇందిరాపార్కు దగ్గర మహాధర్నా, ఫిబ్రవరి 7న అసెంబ్లీ ముట్టడి, జూలై 10న దాదాపు 3వేల మందితో కమిషనర్ కార్యాలయం ముట్టడితో పాటు 48గంటల సమ్మె చేశామని పేర్కొన్నారు. ఈ నెల 4న చలో అసెంబ్లీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా.. తమను ఎక్కడికక్కడే అరెస్టులు చేశారన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే అవకాశం సైతం ఇవ్వకపోవడం దారుణమన్నారు. జూలై 26న విడుదల చేసిన నోటిఫికేషన్ 2/23ని రద్దు చేయాలని, సెకండ్ ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

క్రమబద్ధీకరించాలి


పీహెచ్‌సీ ఆవరణలో..

దోమ: ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఏఎన్‌ఎంలను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ఏఎన్‌ఎంలు డిమాండ్ చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట సమస్యలను పరిష్కరించాలంటూ నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కరోనా కాలంలో కష్టపడిన తమకు సరైన గుర్తింపు లభించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి క్రమబద్ధీకరించాలని కోరారు. ఏఎన్‌ఎంలు అంజమ్మ, సలీమా, ప్రమీళ, కాంతమ్మ, కవిత, యాదమ్మ, సత్య అనసూయ పాల్గొన్నారు.

కుటుంబం గడవని స్థితి


పీహెచ్‌సీ ఆవరణలో..

బొంరాస్‌పేట: వేతనాలు తక్కువైనా వెట్టి చాకిరీ చేస్తున్నామని, అయినా తమను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడం లేదని ఏఎన్‌ఎంలు–2 ఆరోపించారు. కుటుంబం గడవని స్థితిలో ఉన్నామని, ప్రస్తుతం కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న ఏఎన్‌ఎంలను పర్మినెంటు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. నిరసనలో పద్మ, లీలావతి, కవిత, సుజాత, హైమావతి, రాములమ్మ, అంజలి ఉన్నారు.

'మీ సేవ'లకు పరుగు

- సంక్షేమ పథకాలకు జోరుగా దరఖాస్తులు
- కిటకిటలాడుతున్న ఆన్‌లైన్ కేంద్రాలు
- ధ్రువ పత్రాలకోసం తప్పని తిప్పలు

దౌల్తాబాద్: ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలకు అర్హుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. గతంలో వృద్ధాప్య పింఛన్ మొదలు, ఇటీవల బీసీ కులవృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సహాయం, మైనార్టీలకు రుణాల పేరిట అర్జీలు స్వీకరించింది. ప్రస్తుతం గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు తీసుకుంటుంది. దీంతో దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు మీ సేవ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. సంక్షేమ పథకాల లబ్ధికి కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి కావడంతో మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుని, ధ్రువ పత్రాల కోసం తహసీల్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

మధ్యవర్తుల దందా

పథకాల విధివిధానాల గురించి తెలుసుకోకుండానే అప్లై చేసేందుకు ప్రజలు ఎగబడుతున్నారు. ఇదే అదనుగా భావించిన కొందరు మధ్యవర్తులు కులం, ఆదాయ సర్టిఫికెట్లను ఇప్పిస్తామంటూ రూ.150 నుంచి 200 వరకు దరఖాస్తు దారుల నుంచి వసూలు చేస్తున్నారు. గృహలక్ష్మి పథకానికి వందలాది దరఖాస్తులు వస్తున్నాయి. గురువారంతో గడువు ముగియడంతో సాయంత్రం 5గంటలు దాటినా దరఖాస్తులు ఎంపీడీఓ కార్యాలయానికి వస్తూనే ఉన్నారు.


మీసేవ, జిరాక్స్ కేంద్రాల వద్ద జనం పడిగాపులు

15న మాదిగల 'విశ్వరూప మహాసభ'

కొడంగల్ రూరల్: ఈ నెల 15వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'మాదిగల విశ్వరూప మహాసభ'కు వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ రానున్నారని, సదస్సును జయప్రదం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని సంఘం జిల్లా కన్వీనర్ మల్లికార్జున్ మాదిగ పిలునిచ్చారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 29 ఏళ్లుగా మందకృష్ణ ఆధ్వర్యంలో సామాజిక న్యాయం, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత కోసం పోరాటం చేస్తున్నారని, అప్పట్లో ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలుకు నోచుకోవడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో బిల్లు పెట్టి ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీస్ సీనియర్ నాయకులు సోమశేఖర్, జిల్లా కో కన్వీనర్ మల్కప్ప, ఆర్.అంజి, కృష్ణంరాజు, సుబాస్, తిరుపతి, ఎంఎస్‌ఎఫ్ నాయకులు జాని, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ


విద్యార్థికి ఫిజియోథెరపీ చేస్తున్న థెరఫిస్ట్. చిత్రంలో హెచ్‌ఎంలు

బొంరాస్‌పేట: దుద్యాల మండలం దళితవాడ పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ శిబిరంలో పలువురు దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరఫిస్ట్ మల్లేశ్ పలువురికి చికిత్స చేశారు. ఈ సందర్భంగా జెడ్పీహెచ్‌ఎస్ దుద్యాల క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు నెహ్రూచౌహాన్ మాట్లాడారు. నరాల బలహీనత ఉన్న విద్యార్థులకు ఈ క్యాంపు ఎంతగానో ఉపయోగపడుతుందని, ఎమ్మార్సీ భవనంలో ప్రతి గురువారం ఫిజియోథెరఫి క్యాంపు ఉంటుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు జలంధర్‌రెడ్డి, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం చందర్, పంచాయతీ కార్యదర్శి రమేశ్, ఐఈఆర్‌పీ రాంశ్రీనివాస్‌బాబు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న వీరశైవులు


మణికంఠ, జ్ఞానేశ్వర్‌లను సన్మానిస్తున్న వీరశైవ సమాజం సభ్యులు

కుల్కచర్ల: పురోహితుడు మణికంఠ వీరశైవ శిరోమణి అవార్డు పొందిన నేపథ్యంలో కుల్కచర్ల మండల వీరశైవ సమాజం ఆధ్వర్యంలో కుల్కచర్ల అయ్యప్ప సేవా సమితి, వీరశైవ లింగాయత్ సమాజం సభ్యులు ఘనంగా మణికంఠను సన్మానించారు. అదే విధంగా ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన బద్రిగారి జ్ఞానేశ్వర్ ఎస్ఐగా ఎంపిక కావడంతో ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షుడు చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి ప్రేంకుమార్‌లు మాట్లాడారు. వీరశైవులు అన్ని రంగాల్లో రాణించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు రవిచంద్ర, ప్రకాష్, మాంతయ్య, కాశినాథయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే విజయావకాశాలు


శరత్‌చంద్రయాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ప్రధానకార్యదర్శి రఘునాథ్‌యాదవ్

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ప్రధానకార్యదర్శి రఘునాథ్‌యాదవ్ అన్నారు. ఇటీవల వెలువడిన ఎస్ఐ ఫలితాలలో పట్టణానికి చెందిన చంద్రయ్యయాదవ్, దుర్గమ్మ దంపతుల కూమారుడు శరత్‌చంద్రయాదవ్ ఎస్ఐగా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా గురువారం రఘునాథ్‌యాదవ్ ఆధ్వర్యంలో శరత్‌చంద్రయాదవ్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి లక్ష్య సాధనకు ఇష్టపడి చదివితే విజయ అవకాశాలు దక్కుతాయన్నారు. ఉన్నత విద్యను అభ్యసించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని, భవిష్యత్‌లో తమ కుటుంబాలకు ఆసరాగా నిలవాలని తెలిపారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ తాలూకా అధ్యక్షుడు మల్లేశ్, రవియాదవ్, వెంకటేశ్ యాదవ్, రాజ్యలక్ష్మి యాదవ్, నారాయణయాదవ్, యాదయ్యయాదవ్, కృష్ణయ్యయాదవ్, శ్రీనివాస్ యాదవ్, పరందాములు యాదవ్, జగన్‌యాదవ్, మల్లేశ్ యాదవ్, పాపయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


కాంగ్రెస్‌లో చేరిన యువకులు

మొయినాబాద్: అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) మొయినాబాద్ మండల ఉపాధ్యక్షుడు క్యామ రవీందర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం చేవెళ్లలో జరిగిన పార్టీ విస్తృతస్థాయి సమావేశం అనంతరం ఏఐసీసీ కార్యదర్శి మన్సూర్ అలీఖాన్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆయనతో పాటు బీజేపీకి చెందిన మల్‌రెడ్డిగారి రాజిరెడ్డి, మరికొంత మంది యువకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దర్శన్, మండల పార్టీ అధ్యక్షుడు మాణయ్య, సీనియర్ నాయకులు రవీందర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, సురేష్, యూత్‌కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, నవీన్, గోవిందు నిరంజన్‌రెడ్డి ఉన్నారు.

'గృహలక్ష్మి'కి పోటెత్తిన దరఖాస్తులు


మోమిన్‌పేట: దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు


పెద్దేముల్: ఎంపీడీఓ కార్యాలయంలో..

- ఆఖరి రోజున భారీగా అర్జీలు
- గడువు పెంచాలంటున్న దరఖాస్తుదారులు
- నేటి నుంచి విచారణ ప్రారంభం: ధారూరు ఎంపీడీఓ చంద్రశేఖర్

మోమిన్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు వెల్లువలా వచ్చి చేరాయి. మూడు రోజుల గడువు ఇవ్వడంతో లబ్ధిదారులు 1,758 మంది దరఖాస్తులు చేసుకున్నారు. నియోజకవర్గానికి 3వేల చొప్పున ఇళ్లను మంజూరు చేసిన ప్రభుత్వం.. ఒక్క మండలం నుంచే ఇన్ని దరఖాస్తులు రావడం అధికారులను విస్మయానికి గురిచేసింది. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందకున్నా.. మీ సేవలో దరఖాస్తు చేసుకున్న రశీదును ఫారానికి జత పర్చి ఇవ్వడంతో అర్జీలను స్వీకరించారు.

పెద్దేముల్‌లో 3581

పెద్దేముల్: రెండు రోజుల వ్యవధిలో గృహలక్ష్మి పథకానికి 3,581 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ లక్ష్మప్ప తెలిపారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు లేకున్నా అర్జీలు తీసుకున్నామని వెల్లడించారు. సమయానికి సర్వర్ పనిచేయక రెవెన్యూ సిబ్బంది ఇబ్బంది పడ్డారని తెలిపారు. ఏది ఏమైనా 24 గంటల్లో కుల ధ్రువీకరణ పత్రాలు అందచేస్తున్నామని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

ధారూరులో 3,006

ధారూరు: ధారూరు మండలం 32 గ్రామ పంచాయతీల నుంచి 3,006 మంది గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. మొదటి రోజు 112, రెండో రోజు 965, మూడో రోజు 1,929 అర్జీలు అందాయన్నారు. వచ్చిన అప్లికేషన్లను క్షుణ్ణంగా పరిశీలించి గ్రామాల వారీగా విభజిస్తామని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం నుంచి దరఖాస్తుదారుల గ్రామాలు, తండాలకు వెళ్లి విచారణ చేసి, ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని చెప్పారు. విచారణ సమయంలో ఎవరైనా గృహలక్ష్మి కోసం దరఖాస్తు చేస్తే.. స్వీకరిస్తామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్జీలు తీసుకోవాల్సి ఉంటుందని ఆయన చెప్పారు.

తాండూరులో 3వేలు

తాండూరు రూరల్: తాండూరు మండలం 33 గ్రామం పంచాయతీల నుంచి 3 వేలకు పైగా గృహలక్ష్మి అర్జీలు వచ్చాయని ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. వచ్చిన దరఖాస్తులను గ్రామాల వారీగా విభజిస్తామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని చెప్పారు. మేజర్ గ్రామ పంచాయతీ కరన్‌కోట్‌లో 350కి పైగా అర్జీలు పెట్టుకున్నట్లు వెల్లడించారు.

ఆందోళన వద్దు

యాలాల: గృహలక్ష్మి పథకానికి పరిమిత సమయం అంటూ ఆందోళన చెందాల్సిన పని లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అన్నారు. వైస్ ఎంపీపీ రమేష్, కోఆప్షన్ సభ్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అక్బర్‌బాబాతో కలిసి ఆయన మాట్లాడారు. దరఖాస్తుల సమయం విషయంలో అర్హులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ విషయం ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

గడువు పెంచాలి

బొంరాస్‌పేట: గృహలక్ష్మి దరఖాస్తు గడువును పెంచాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు గౌడ్ డిమాండ్ చేశారు. ఇల్లు లేక నిరుపేదలు ఎంతోమంది గుడిసెల్లో జీవిస్తున్నారని, అర్హులందరికీ మంజూరు చేయాలని కోరారు. వైన్స్ షాపుల టెండర్లు రెండువారాల గడువు ఇచ్చి, గృహలక్ష్మికి రెండు రోజుల గడువు ఇవ్వడం సిగ్గుచేటన్నారు.

కుల్కచర్లలో 5,700

కుల్కచర్ల: గృహలక్ష్మి పథకానికి లబ్ధిదారుల నుంచి భారీగా దరఖాస్తులు వచ్చాయి. కుల్కచర్ల మండల పరిధి నుంచి సూమారు 5వేల700 మంది అర్జీ పెట్టుకున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. అర్జీదారులు ఎవరు మధ్యవర్తులను ఆశ్రయించవద్దని సర్పంచ్ సౌమ్యారెడ్డి సూచించారు.

పర్మినెంట్ చేయాలి

అనంతగిరి: మున్సిపాలిటీ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట వంటా వార్పు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రమాద బీమా రూ.15 లక్షలు ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానం రద్దు చేయాలని, అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వినోద్, చెన్నయ్య, రాజు, అశోక్, మైపాల్, లక్ష్మి, అనసూయ, లక్ష్మమ్మ, జ్యోతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు వీడ్కోలు

పెద్దేముల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏలను పర్మినెంట్ చేసి, వివిధశాఖల్లో సర్దుబాటు చేస్తున్న విషయం విధితమే. గురువారం పెద్దేముల్ రెవెన్యూ కార్యాలయంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి వివిధ గ్రామాల వీఆర్ఏలను సన్మానించి వీడ్కోలు పలికారు. ఎంతో కాలంగా పనిచేస్తున్న వీఆర్ఏలను ప్రభుత్వం గుర్తించడం హర్షించదగిన విషయం అని చెప్పారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయాలని వారికి సూచించారు.

ఆటో డ్రైవర్లకు రూ.10 లక్షల బీమా


ఆటో డ్రైవర్లకు బీమా బాండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

బాండ్లు అందజేసిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: తాండూరు నియోజకవర్గక ఆటో డ్రైవర్లకు గురువారం ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో తొలి విడతగా ఒక్కో ఆటో డ్రైవర్‌కు రూ.10లక్షల ప్రమాద బీమా కల్పిస్తూ 50 మందికి బాండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించి వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు గోపాల్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప, నాయకులు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన వ్యాపారులు

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి లాంటి మంచి వ్యక్తిని ఇప్పటి వరకు ఎక్కడా చూడలేదని గ్రేన్ అండ్ సీడ్స్ మర్చంట్ ప్రతినిధులు కొనియాడారు. క్యాంపు కార్యాలయంలో వ్యాపారులు ఎమ్మెల్యేను కలిసి సన్మానించి మాట్లాడారు. అనతికాలంలోనే తాండూరును అభివృద్ధి చేసి చూపించిన ఘనత ఎమ్మెల్యేకే దక్కుతుందని చెప్పారు.

ఆలయ ఈఓగా నరేందర్


నరేందర్‌కు బాధ్యతలు అప్పగిస్తున్న శ్రీనివాస్

చేవెళ్ల: చేవెళ్లలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయం నూతన ఈఓగా టి.నరేందర్ బాధ్యతలు స్వీకరించారు. గురువారం పాత ఈఓ శ్రీనివాస్ బాధ్యతలను నరేందర్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా దేవాలయ ఫౌండర్ ట్రస్టీ వామనాచర్యులు, పూజారులు శ్రీపాదు, శ్రీకాంత్, కన్న ఉన్నారు. అనంతరం నూతన ఈఓ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వికారాబాద్ జిల్లా అనంత పద్మనాభస్వామి దేవాలయం నుంచి వచ్చినట్లు తెలిపారు.